


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

6

(జూలై ౨౨, 1976, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

'నిష్కామని ప్ర' - అంటారు మన పెద్దలు.

ఇలాటి త్యాగం ఉండటం మానవ ధర్మాల్లో ఒకటి అన్నమాట నిజమే కావచ్చు. కానీ అంత త్యాగానికి పూనుకునే వ్యక్తి, ముందుగానే సర్వసంగ పరిత్యాగిగా మారడానికీ, అంత సంస్కారం లేకపోతే బైరాగిగానో, పకీరుగానో తయారుకావడానికి సంసిద్ధుడై ఉండాలి.

ఆర్థికస్థితిని దృష్టిలో పెట్టుకుని మాట్లాడితే - ఉన్నదంతా నోరెత్తకుండా దోచి పెట్టడమనన్న స్థితికి సంసిద్ధ పడటం - సేవాధర్మం దృష్ట్యా ఆలోచిస్తే శక్తినంతా ధారపోయడం... ఇతరులను సహాయం చేశామన్న ఆనందాన్నే పరమావధిగా పెట్టుకుని బ్రతకడం అవుతుంది. ఈనాటి జనాభాకు అసాధ్యమా అనేది ప్రశ్న.

గతంలో ఒక వ్యాసంలో ఆంజనేయులుగారి సేవా ధర్మాన్ని గురించి కొంత చెప్పాను. ఆయన నిజంగా నిష్కామయోగే!... ఎవరికైనా సహాయపడకపోతే ఆయనగారికి తోచదు. మళ్ళీ ఎవరేమి చెయ్యకపోయినా బాధపడను.

ఒకసారి ఇద్దరం ఆటోలో వస్తూండగా పెద్దవాన వచ్చింది. దానికి తోడు ఆటోలో పెట్రోలు అయిపోయింది. ఒకచోట ఆగిపోయాం. వాన వెలవలేదు. తడుస్తూ మరో ఆటో తీసుకువచ్చారు. ఇద్దరి ఇళ్ళూ చెరో వైపునా ఉన్నాయి. నన్ను ఆ ఆటోలో వెళ్ళమన్నారు. "మీ ఇంటి దగ్గిర మిమ్మల్ని దింపి వెడతా"నన్నాను.

"అబ్బే మీరు వెళ్ళండి.. మా ఇంటికి నేను కొంచెం ఆలస్యంగా వెళ్ళినా ఫర్వాలేదు. మీరు వెళ్ళండి" అన్నారు. ఆయనగారు వాన వెలిసిన దాకా ఉండి - తర్వాత ఇల్లు చేరారట. మర్నాడు నవ్వుతూ చెప్పారా విషయం. ఇంతకీ మేం వెళ్ళింది నా పనిమీద. వానలో తడిసి ముద్ద అయింది ఆంజనేయులు గారు.

"ఎందుకండీ! ఆంజనేయులుగారు మీరిలా పరోపకారంలో మునిగి అక్కరలేని అవస్థలు పడతారు?" అన్నాను. అలాటి ప్రశ్నలు వేసినప్పుడాయన అదోరకంగా నవ్వుతారు.

***<u>నొప్పించడం తేలిక మెప్పించడం కష్టం.</u>***

"ఎవరికోసం వారు తాపత్రయ పడటం మామూలే.. మరొకరికి కొంచెం సేవచేస్తే మనస్సు బాగుంటుంది. మన కోసం చేసుకుంటే - డ్యూటీచేసుకున్నట్లుంది. అందులో బ్యూటీ ఏం వుంది?.." అన్నారు.

"అవునులెండి మీరు కష్టపడకుండా నష్టపడకుండా ఏదైనా సహాయం చెయ్యవచ్చు. కాని ఇలాగా?" అంటే మళ్ళీ ఒక నవ్వు నవ్వి.

"నష్టకష్టాలను గురించి ఆలోచిస్తూ ఉంటే - ఒక జీవితం నష్టంలో పడిపోతుంది. ఏదో చెయ్యాలి" చేతనైనంతవరకు.. అన్నారు.

"మీకు ప్రతిఫలం ఏం ఉంటుందండి? నేను మీకు శ్రమ కలిపిస్తున్నందుకు చింతిస్తున్నాను. అంతకంటే చేసేదేం లేదు. మరి, మీరు ఇలాటి త్యాగాలు కొంతవరకూ తగ్గించుకోవడం మంచిది" అన్నాను.

"ఒక్క విషయం ఆలోచించండి.. ఒకర్ని నొప్పించడం తేలికా, ఒప్పించడం తేలికా చెప్పండి.." అన్నారాయన.

"మెప్పించడమే!" అన్నాను.

"అందుకేనండి ప్రయత్నం.. ఇతరులు నాకేమి సేవచేయకపోయినా - ఒకరిని సేవించి మెప్పించడం జీవితధర్మం అని కొందరన్నా తెలుసుకుంటే మంచిదని నా భావం" అన్నారాయన.

"మరి ఇతరులు మీ సేవాభావాన్ని గుర్తించి మీకు తిరిగి ఏదైనా మంచి చెయ్యకపోతే మీరు బాధపడ ఆంజనేయులుగారూ!" అన్నాను.

"అలా ఆలోచిస్తూ కూర్చుంటే ఇతరులకు సేవేం చేస్తాం.. దేశానికి, సంఘానికి సేవచేసిన పెద్దల్ని తలుచుకుని హాయిగా నిద్రపోవలసిందే"

"అసలెవరినైనా నా ప్రత్యుపకారం కోరారా మీరు?" అన్నాను. మళ్ళీ అదే నవ్వు..

"ఎప్పుడన్నా అడగవలసి వస్తూంది. చాల తక్కువేననుకోండి. అయినా నెరవేరవని బాధపడను. కొంతకాలం క్రింద ఒక అమ్మాయి బి.ఏ తెలుగు పరీక్షకు వెడుతోందంటే - మూడు నెలలు పాఠాలు చెప్పాను.

చాలా కాలం క్రింద చదివినవి గనుక నేను ముందుగా చదువుకోవలసి వచ్చేది. సంశయాలుంటే మరొకళ్ళను అడగవలసి వచ్చేది. అలాగే చెప్పాను. అదృష్టవశాత్తూ ఫస్టు క్లాసులో ప్యాసయింది.

నా మూలంగా ఒకరు పర్మనెంటుగా ఉండే డిగ్రీ సంపాదించారు. అంతకన్నా కావలసిందేం ఉంది- అని గర్వపడ్డాను. అసలు నేను కాలేజీలో చదివే రోజుల్లో తెలుగు ఎం.ఏ చదివి ఏ కాలేజీలోనో చేరి తెలుగు పాఠాలు చెప్పాలని ఉవ్విళ్ళూరుతూ ఉండేవాణ్ణి. అది నెరవేరలేదు. జర్నలిజంలో చేరి పాళీలు అరగదీయవలసి వచ్చింది. పోనీ ఆ అమ్మాయికి చెప్పడం ద్వారా.. వెనుకటి కోర్కె. నెరవేరింది కదా - అనుకున్నాను. కొంతకాలం తర్వాత అర్జంటుగా ఏవో కాగితాలు కాపీ చేసి పెట్టవలసి వచ్చింది. కనిపిస్తే అడిగాను - కొంచెం శ్రమపడి కాపీ చెయ్యాలి - కొద్దికాగితాలున్నాయి - అని. ఆమె నను ఏదో కొత్తవాణ్ణి చూచినట్లు చూచి - "ఏమిటి ఏం చెయ్యాలి?" అన్నది.

'కాగితాలు కాపీ' చెయ్యమ్మా. అన్నాను. ఆమె అతి విసుగ్గా చూచి "నా కసలు కాపీ చెయ్యడం అలవాటులేదు. అయినా నా తెలుగు దస్తూరీ బాగుండదు. అందులో నా వంట్లో సుస్తీగా ఉంది" అంది.

"అలాగా. సుస్తీగా ఉందా! దస్తూరి మాత్రం బాగానే ఉంటుంది. మీరు నోట్సు వ్రాసున్నప్పుడు చూశాను కదా" అన్నాను.

"అప్పుడు సంగతా! - ఇప్పుడు వేళల్లో అంత బలం లేదు. కలం సరిగ్గా సాగదు -" అని ఏదో సంజాయిషి చెప్పింది. సుస్తీగా ఉందంటోంది. వేళ్ళల్లో అంత బలం లేదంటోంది - బహుశః వేవిళ్ళేమోనని బయలుదేరాను ఇంటికి వచ్చేద్దామని.

<u>*మార్కులు బావ వేయించాడు*</u>

తీరా వస్తున్న వాణ్ణి ఆవిడ మళ్ళీ పిలిచింది. 'ఏమిటమ్మా?' అని అడిగాను. ఆవిడ అదోరకంగా, అంటే అతి చులకనగా ఒక చూపు చూసి "మీరు పాఠాలు అన్ని రోజులు చెప్పారు, నోట్సు చెప్పారు. చచ్చిచెడి చదివాను. కాని మీరు చెప్పిందాంట్లో ఒక్కటీ రాలేదు.

మా బావంటూ ఒకాయన ఉన్నాడు కనుక ఆయన మార్కులు వేయించాడు. ఫస్ట్ క్లాసు వచ్చింది. బ్రతికి బయటపడ్డాను" అన్నదామె.

"ఎలాగైతేనేం? మీరు ప్యాసయ్యారు.. ఫస్ట్ క్లాసు వచ్చింది. మీ బావ దయవల్ల" అన్నాను.

"అవునండీ నిజం" అన్నదామె.

మాట్లాడకుండా తిరిగి వచ్చాను. ఆ రాత్రి నిద్రపోవాలను నిద్రపోవాలనుకుంటున్నప్పుడు "బావంటూ ఒక్కడున్నాడు గనుక" అనే మాటే పది మాట్లు జ్ఞాపకం వచ్చింది.

- ఇలాటి సందర్భాలు కొన్ని ఉంటూ ఉంటాయి. అంతమాత్రంతో మన సేవాధర్మాన్ని ఒదులుకుంటామా?" అన్నారు ఆంజనేయులుగారు -

నేను మద్రాసులో ఉండగా - కొంచెం పెద్ద ఇల్లు తీసుకున్నాను. ఒక మిత్రుడు ఇల్లు ఖాళీ చేయవలసి వచ్చింది. నా దగ్గరికి వచ్చి "ఇల్లు దొరికేదాకా మీ సావిట్లో ఉంటాం.. పదిరోజుల్లో ఇల్లు దొరుకుతుంది. లేకపోతే పిల్లల్ని ఇంటికి పంపించాలి. సామాన్లు ఎక్కడో వెయ్యాలి. ఖర్చులు అంతులేకుండా అవుతాయి. మీరు సహకరించాలి" అన్నాడు.

మద్రాసు మహానగరంలో ఇళ్ళ ఇబ్బంది విషయం తెలుసు. అందులో నేను క్రొత్తగా వెళ్ళిన వాణ్ణి - అందుకని వెంటనే అన్నాను "అదేవిటండీ! అలా అంటారు - సావిడి మీదే అనుకోండి.. పదిరోజులు మేము ఎలాగో అలా సర్దుకొంటాం. మీతో ఈ కొద్ది రోజులూ కలిసి ఉండటం.. నాకెంతో ఆనందదాయకం" అన్నాను.

ఆయన పిల్లా జెల్లాతో వచ్చి చేరాడు. ఇల్లు వెతుకుతున్నాడు కాబోలు ననుకుంటూ ఉండేవాణ్ణి ప్రతిరోజు. రోజులు గడిచాయి. ఇంకో పది... ఇంకో పది... మనసు ఒప్పలేదు. అద్దె అంతా కట్టక తప్పలేదు. ఆయన అసలు విషయమేమీటో మనసు విప్పి చెప్పలేదు. అలా రెండు నెలలు గడిచినాయి. మాట్లాడడం తగ్గించాడు. విష్ చేసి వెళ్ళిపోయేవాడు. ఇంకో నెల గడిచింది.

చివరకు ధైర్యం చేసి "మావాళ్ళు వస్తున్నారు. కొంచెం ఇల్లు ఇబ్బంది అవుతుంది" అన్నాను.. దానికి ఆయన ముఖం చిట్లించి "ఇప్పుడు పొమ్మంటే ఎక్కడికి పోను. మా ఆవిడ నీళ్ళు పోసుకుంది. ఒకళ్ళ కాళ్ళు పట్టుకుని బ్రతిమాలాల్సిన అవసరం వచ్చింది. మా ఊర్లో పది గదుల ఇల్లుంది. కావాలంటే ఈ నెల నుంచీ ఒక పాతిక ఇస్తాను - మమ్మల్ని ఇబ్బంది పెట్టకండి" అన్నాడు.

నేను ఎలాటి ముఖం పెట్టవలసి వచ్చిందో చెప్పలేను. ఇలాటి సందర్భాల్లో ఫోటోలు తీసి దాచుకోవడానికి ప్రతి ఇంట్లో ఒక హాండ్ కెమెరా ఉండి తీరాలి.

గత్యంతరం లేక నేను ఇల్లు ఖాళీ చెయ్యవలసి వచ్చింది. ఇంటి యజమాని ఆయన్ని కూడా వెళ్ళగొట్టి అప్పగించమన్నాడు. రెండు నెలలు నేను లేకుండా ఇంటి మొత్తానికి అద్దెకట్టి - ఆయన్ని బయటకు పంపడం జరిగింది.

అప్పటినుంచీ ఎవరికన్నా ఏదైనా సహాయం చేద్దామన్నా, చోటు ఇద్దామన్నా "సావిడి సాంబశివరావుకు ఇచ్చినట్లు" అనేది సామెతగా మనస్సులో మెదులుతూ ఉంటుంది.

●●●

Comment on this article..